వార్డు ఉప ఎన్నికలు ప్రశాంతం

- ఉదయం పోలింగ్, మధ్యాహ్నం ఫలితాల వెల్లడి
- దమ్మెన్ను పంచాయతీలో గరిష్టంగా 85.18 శాతం పోలింగ్

కొవ్వూరు/గోపాలపురం/ఉండ్రాజవరం: పంచాయతీ వార్డు ఉప ఎన్నికలు శనివారం కొవ్వూరు డివిజన్ పరిధిలో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. గోపాలపురం, కొవ్వూరు, ఉండ్రాజవరం మండలాల్లో నాలుగు వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 1,652 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,385 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోపాలపురం పంచాయతీ 12వ వార్డులో మొత్తం 534 మంది ఓటర్లు ఉంటే 438 మంది, అదే పంచాయతీలోని 16వ వార్డులో 539 మంది ఓటర్లు ఉండగా 461 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పంచాయతీ పరిధిలోని రెండు వార్డుల్లో మొత్తం 1,073 మంది ఓటర్లు ఉండగా 899 మంది ఓటు వేశారు. 83.78 శాతం పోలింగ్ నమోదైంది. 12వ వార్డులో 82.12 శాతం, 16వ వార్డులో 85.52 శాతం చొప్పున పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. ఇక ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను పంచాయతీ తొమ్మిదో వార్డులో 135 మంది ఓటర్లు ఉండగా, వారిలో 115 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85.18 శాతం పోలింగ్ నమోదైంది. కొవ్వూరు మండలం ఐ.పంగిడి పంచాయతీ 8వ వార్డులో 444 మంది ఓటర్లు ఉండగా, వారిలో 371 మంది ఓటు వేశారు. సరాసరి 83.55 శాతం పోలింగ్ నమోదైంది.


కొవ్వూరు మండలం ఐ.పంగిడి పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

ఫలితాల వెల్లడి

కొవ్వూరు మండలం ఐ.పంగిడి పంచాయతీ ఎనిమిదో వార్డు నుంచి కొడమంచిలి నాగమణి విజయం సాధించారు. ఇక్కడ మొత్తం 371 ఓట్లు పోలైతే వాటిలో నాలుగు ఓట్లు చెల్లనవిగా నిర్ధారించారు. పోలుమాటి గంగమ్మకి 168 ఓట్లు రాగా, నాగమణికి 199 ఓట్లు వచ్చాయి. దీంతో నాగమణి 31 ఓట్లు ఆధిక్యంతో గెలుపొందినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను పంచాయతీ 9వ వార్డులో కొడవటి సూరిపండుపై మట్టపర్తి అచ్యుత రామయ్య 27 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సూరిపండుకి 43, అచ్యుత రామయ్యకు 70 ఓట్లు పోలయ్యాయి. రెండు ఓట్లు చెల్లనివిగా నిర్ధారించారు. ఇక గోపాలపురం పంచాయతీ 16వ వార్డులో కొడవటి విజయచంద్రబాబుకు 252 ఓట్లు, రాపాక శ్యాంబాబుకి 18, సనమండ్ర బాబురావుకు 183 ఓట్లు రాగా 8 ఓట్లు చెల్లనివిగా అధికారులు నిర్ధారించారు. ఈ వార్డులో 69 ఓట్లు మెజార్టీతో విజయచంద్రబాబు గెలుపొందారు. అదే పంచాయతీలోని 12వ వార్డులో కూనపోము శాంతకు తొమ్మిది, కొల్లి పద్మావతికి 246, షేక్ వహీదాకు 177 ఓట్లు రాగా, ఆరు చెల్లని ఓట్లుగా అధికారులు నిర్ధారించారు. ఈ వార్డు నుంచి పద్మావతి 69 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

పంచాయతీ పేరు	వార్డు నంబర్	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారి సంఖ్య	పోలింగ్ శాతం	విజేత పేరు
ఐ.పంగిడి	8	444	371	83.55	కొడమంచిలి నాగమణి
గోపాలపురం	12	534	373	82.02	కొల్లి పద్మావతి
గోపాలపురం	16	539	370	85.52	కొడవటి విజయచంద్రబాబు
దమ్మెన్ను	9	135	115	85.18	మట్టపర్తి అచ్యుత రామయ్య


గోపాలపురం పంచాయతీ 12,16 వార్డుల విజేతలు కొల్లి పద్మావతి, కొడవటి విజయచంద్రబాబు

రోడ్డుపై గడ్డర్ల వివాదంపై కొవ్వూరు ఆర్డీవో విచారణ


తాళ్లపూడిలో విచారణ చేస్తున్న ఆర్డీవో మల్లిబాబు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని సాయితేజ థియేటర్ రోడ్డుపై ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్ల వివాదంపై శనివారం కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు ఇక్కడకు వచ్చి విచారణ జరిపారు. ఇక్కడి సీసీ రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా దాదాపు ఏడాది క్రితం థియేటర్ యాజమాన్యం ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేయించింది. దీనిపై స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు గతంలో తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు ఆ గడ్డర్లను తొలగించడానికి వెళ్లారు. వాటిని తొలగించే అధికారం అధికారులకు లేదని థియేటర్ భాగస్వామి జద్దు శ్రీనివాసరావు హైకోర్టులో కేసు వేశారు. గడ్డర్లను తొలగించకుండా కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్టు థియేటర్ యాజమాన్యం తెలిపింది. అయితే ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇటీవల రైస్ మిల్లర్లు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆర్డీవో మల్లిబాబు శనివారం ఇక్కడకు వచ్చి విచారణ జరిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారుల ద్వారా కోర్టుకు అందజేస్తానని చెప్పారు.

క్లుప్తంగా

కొవ్వూరమ్మను దర్శించుకున్న మంత్రి వనిత


కొవూరమ్మను దర్శించుకున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: పట్టణంలో కొలువైన కొవ్వూరమ్మ 52వ వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారి జాతరను వైభంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని రాజీవ్ కాలనీలో వాడబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాతర మహోత్సవాల్లో శనివారం హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. మంత్రి వనితను కమిటీ సభ్యులు ఆలయ మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు.జాతర సందర్భంగా నిర్వహించిన శక్తి వేషాలు, గరగ, బేతాళ,కాంతారా డాన్సులు, బుట్టబొమ్మల ప్రదర్శనలను మంత్రి కొద్దిసేపు ఆసక్తిగా తిలకించారు.అనంతరం ఏటిగట్టుపై కొలువైన కొవ్వూరమ్మను దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, నాయకులు పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్, గంధ్రోతు శివరామకృష్ణ, బత్తి నాగరాజు,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాలువలకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో చెదురు మదురుగా వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలో ఉభయ గోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాల పరిధిలోని రైతుల వ్యవసాయ అవసరాల మేరకు కాలువలకు శనివారం నీటి విడుదలను తగ్గించారు. నీటి పారుదల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమ డెల్టాకు 5,500, మధ్య డెల్టాకు 2,600, తూర్పు డెల్టాకు 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని ఏలూరు కాలువకు 855, తణుకు కాలువకు 736, అత్తిలి కాలువకు 512, నరసాపురం కాలువకు 2020, ఉండి కాలువకు 1106 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మండల కమిటీలే సమస్యలు పరిష్కరించాలి

నల్లజర్ల: రిటైర్డు ఉద్యోగులు వివిధ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం ఇబ్బందికరం కాబట్టి రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల మండల శాఖలే వారి సమస్యలను పరిష్కరించాలని పశ్చిమ, తూర్పు, ఏలూరు జిల్లాల రిటైర్డు ఉద్యోగుల సంఘ కో–ఆర్డినేటర్ బి.జేమ్స్ సూచించారు. నల్లజర్ల మండల రిటైర్డు ఉద్యోగుల సంఘ ప్రథమ వార్షికోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు ఎస్ఎం ఆలీ సాహెబ్ సమావేశానికి అధ్యక్షత వహించారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం చర్చించింది.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ సెక్రటరీ బాలయ్య అధ్యక్షతన లాల్ నెహ్రూ, నిమ్మలపూడి ప్రసాద్, మహిత కుమారిలను సత్కరించారు. మండల కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా సంఘాధ్యక్షుడు పి.సత్యనారాయణ, కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు, ఐడీపీ అప్పారావు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి ఈకేవైసీ


ఆసుపత్రిలో వెంకటలక్ష్మితో ఈకేవైసీ బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ షేక్ ముంతాజ్

ఉండ్రాజవరం: మండలంలోని పసలపూడికి చెందిన జరుగు వెంకటలక్ష్మి కాపు నేస్తం లబ్ధిదారు. గుండెకు ఆపరేషన్ చేయించుకున్న ఆమె ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఓ హాస్పిటల్ ఐసీయూలో కోలుకుంటోంది. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామ వలంటీర్ షేక్ ముంతాజ్ శనివారం రాజమహేంద్రవరం వెళ్లి వెంకటలక్ష్మి చేత కాపు నేస్తం ఈకేవైసీ బయోమెట్రిక్ తీసుకుంది. ఈ సందర్భంగా వలంటీర్ ముంతాజ్‌ను సర్పంచ్ కట్టా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కట్టా విజయలక్ష్మి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ షాజహాన్, సచివాలయ కన్వీనర్లు అభినందించారు.

ఎంపీటీసీ సభ్యుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

నిడదవోలు రూరల్: మండలంలోని డి.ముప్పవరం ఎంపీటీసీ సభ్యుడు సంగినీడి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సత్యనారాయణ త్వరగా కోలుకుని వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, మాజీ సర్పంచ్ మద్దాల ప్రభు, పార్టీ నాయకులు నాగిరెడ్డి సత్తిపండు, అజయ్‌కుమార్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

నాలుగేళ్లలో రూ.4.6 లక్షల కోట్ల లబ్ధి


హాజరైన ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు


సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

- 12 నుంచి 6 శాతానికి తగ్గిన పేదరికం
- హోం మంత్రి తానేటి వనిత
- నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశం

కొవ్వూరు: గత నాలుగేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా 2.5 కోట్ల మంది ప్రజలకు రూ.4.6 కోట్ల మేర లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లతో శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఆమె సమీక్ష జరిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే దిశగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. రాష్ట్రంలో 12 శాతం ఉండే పేదరికం వైఎస్సార్ సీపీ పాలనలో 6 శాతానికి తగ్గిందని నీతి అయోగ్ నివేదికలో వెల్లడైందన్నారు. సచివాలయ కన్వీనర్లు పార్టీ కోసం అంకిత భావంతో పని చేయాలని మంత్రి వనిత సూచించారు. ఆరోగ్యశ్రీ , 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఫ్యామిలీ డాక్టర్ వంటి బృహత్తర పథకాలతో ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. చేయూత, కాపు నేస్తం, అగ్ర వర్ణాల్లో పేదలకు ఈబీసీ నేస్తం వంటి పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. అంతేగాకుండా పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. తక్కువ కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ఘనత జగనన్నదే అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మేలును సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భవిష్యత్తులో పేదలకు మరింత మేలు చేకూర్చే దిశగా పాలన ఉంటుదన్నారు. తటస్థ ఓటర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేకూర్చుతున్న మేలుని వివరించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఎంపీపీలు కాకర్ల నారాయుడు, మట్టా వీరాస్వామి, జొన్నకూటి పోసిరాజు, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గంధ్రోతు అంజనీదేవి, వైఎస్సార్ సీపీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, తాళ్లపూడి మాజీ ఎంపీపీ కొమ్మిరెడ్డి పరశురామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభొట్టి గంగాధర శ్రీనివాస్, పార్టీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలకునికి అండగా నిలవండి

- కొవ్వూరు 21వ వార్డులో హోం మంత్రి తానేటి వనిత
- నిడదవోలు 11వ వార్డులో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ..

కొవ్వూరు: సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని హోం మంత్రి తానేటి వనిత కోరారు. పట్టణంలోని 21వ వార్డులో శనివారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు ఆమె అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గంధ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్లు బండి పట్టాభి రామారావు, వల్లభొట్టి గంగాధర శ్రీనివాస్, కౌన్సిలర్లు దేవగుప్తాపు చాందిని, వరిగేటి లలితకుమారి, పతివాడ నాగమణి, అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, మద్దిపట్ల సాయిగీత, చీరా అరుణ, తోట లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.


కొవ్వూరు 21 వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి వనిత


నిడదవోలు 11వ వార్డు వాసులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

అన్ని వర్గాలూ మెచ్చేలా జగనన్న పాలన

నిడదవోలు: అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ చిలకల శారదాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే తొలుత స్థానిక గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సీఎం జగనన్న పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్లు చిలకల శారదాదేవి, కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, బిర్రె పార్వతి, ఎండీ షకీరా బేగం, ఆకుల ముకుందరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, అహ్మదున్నీసాబేగం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చిన్న తిరుపతి క్షేత్రంలో భక్తుల రద్దీ


శ్రీవారి ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: చిన్న తిరుపతి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, అన్నదాన భవనం ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం వరకూ క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.


అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

రెండు వేల మందికి అన్న సమారాధన

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు రావడంతో స్వామి వారి దర్శనానికి గంట సమయం పట్టింది. వందలాది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. దాతల సహాయంతో సుమారు రెండు వేల మందికి అన్న సమారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో ఉచిత అన్న సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌లో 95 మందికి సేవలు

చాగల్లు: ఎస్. ముప్పవరంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.నిశిత, పీఆర్ఎల్ దేవి 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

మేం వైఎస్సార్ సీపీలోనే ఉన్నాం

తాళ్లపూడి: తాము జనసేన పార్టీలో చేరలేదని మండలంలోని రావూరుపాడుకు చెందిన పలువురు యువకులు స్పష్టం చేశారు. ఈ గ్రామానికి చెందిన పుప్పాల సుధాకర్, పుప్పాల కృష్ణ, పుప్పాల సాయి, పుప్పాల శ్రీను తదితరులు మాట్లాడుతూ ఇప్పటికీ తాము వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పుప్పాల వెంకటరావు సమక్షంలో ఆ యువకులు రావూరుపాడులో శనివారం విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల క్రితం తమను జనసేన కొవ్వూరు కార్యాలయానికి విషయం చెప్పకుండా పిలిపించి, ఆ పార్టీ నాయకులు తమ ఇష్టానికి వ్యతిరేకంగా జనసేన కండువాలు కప్పారని వివరణ ఇచ్చారు.

హృదయాలయానికి సాయం

నిడదవోలు: స్థానిక మానసిక దివ్యాంగుల కేంద్రం నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన దాత భమిడిపాటి వెంకట చంద్రశేఖర్ శనివారం రూ.ఆరు వేల ఆర్థిక సాయం చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ద్వారా దాత ఈ మొత్తాన్ని హృదయాలయం నిర్వాహకురాలు విశాలాక్షికి అందించారు.

మానవ జీవితంతో ఫొటోగ్రఫీకి విడరాని బంధం

జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గెల్ల రాజు

నల్లజర్ల: ఫొటోగ్రఫీకి మానవ జీవితంతో విడదీయరాని బంధం ఉందని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గెల్ల రాజు అన్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నల్లజర్లలో ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశం అధ్యక్షుడు గూడూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. తొలుత కెమెరా సృష్టికర్త శాస్త్రవేత్త లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ వృత్తిదారులకు సమాజంలో మంచి గౌరవం లభిస్తుందన్నారు.అటువంటి వృత్తిని అంకిత భావంతో పనిచేసి సాటి సభ్యులకు మంచి గుర్తింపు, గౌరవం తీసుకురావాలన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్స్ గెల్ల రాజు, డీవీడీ ప్రసాద్, శ్రీనివాస్, రెడ్డిలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి గోపాలకృష్ణ, సుబ్బు, సభ్యులు పాల్గొన్నారు.


నల్లజర్లలో సమావేశమైన ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు

కొవ్వూరులో..

కొవ్వూరు: ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గెల్లా రాజు, పోకల రవి, శ్రీరంగం శ్రీనివాస్, పోకల శ్రీనివాస్, వై.మధు, దేశాబత్తుల శ్రీనివాస్, గెల్లా సాగర్, పోకల బరీష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పార్టీ అనుబంధ సంఘాల నేతలతో భేటీ

గోపాలపురం: నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో శనివారం ఆయన దేవరపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమం ద్వారా రూ.3 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తనకు అండగా నిలుస్తున్న నాయకులు, కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. నాయకులు గ్రామ స్థాయిలో సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, నరహరిశెట్టి బాబూ రాజేంద్రప్రసాద్, మండల నాయకులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

బ్యాటరీల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తాళ్లపూడి: ఏటీఎంలోని బ్యాటరీలు కాజేసిన కేసులో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలోని నంగవరానికి చెందిన పెచ్చెట్టి నాగరాజు అనే నిందితుడ్ని తాళ్లపూడి పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. స్థానిక ఎస్సై కె.వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాళ్లపూడిలోని డీసీసీ బ్యాంక్ సమీపంలో ఉన్న ఇంటియా వన్ ఏటీఎంలోకి దుండగుడు ప్రవేశించి మూడు బ్యాటరీలు చోరీ చేశాడు. దీనిపై ఆ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎస్.రవికుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బ్యాటరీల విలువ సుమారు రూ.40 వేలు. దీనిపై విచారణ చేపట్టి పెచ్చెట్టి నాగరాజు అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

‘మానవత’ శాంతి ర్యాలీ

నిడదవోలు: మానవత సేవాసంస్థ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులు, టీచర్లతో కలసి మానవహారం చేశారు. ఆ సంస్థ అధ్యక్షుడు కాజ గంగరాజు, ఉపాధ్యక్షులు జీవీఎస్ కృష్ణారావు, దారపురెడ్డి సూర్యచంద్రరావు, గెడా రామచంద్రరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వార్డు విజేతలకు ఎమ్మెల్యే అభినందనలు


విజేతలను సత్కరించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: మండలంలో శనివారం జరిగిన పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో గెలుపొందిన ఇద్దరు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అభినందించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే విజయం సాధించిన ద్వారకాతిరుమల 8వ వార్డు అభ్యర్థి నడికట్టి సీతారామాంజనేయులు, గుణ్ణంపల్లి 6వ వార్డు అభ్యర్థి ముసల నాగ రేణుకలు వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల నాయకులతో కలసి ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించి, పూలమాలలతో సత్కరించారు.అనంతరం పలువురు మండల నేతలు వారిని సత్కరించారు.

ఓటరు సర్వే త్వరగా పూర్తి చేయాలి

నిడదవోలు రూరల్: ఇంటింటి ఓటరు సర్వేను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీఎల్వోలను తహసీల్దార్ ఎం.గంగరాజు ఆదేశించారు. మండలంలోని సమిశ్రగూడెం, గోపవరం గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీతో ఇంటింటి సర్వే ముగుస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో అలసత్వం వహించే బీఎల్వోలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.